ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు
ప్రభాత ఉదయం
హోలీ శుభాకాంక్షలు
ఎం.దామోదర్ రెడ్డి
ఎడిటర్-ప్రభాత ఉదయం

సంపుటి: 2 | సంచిక: 336 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 14 మార్చి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# సభ అందరిదీ.. మీ సొంతం కాదు



### స్పీకర్‌ను ఉద్దేశించి జగదీశ్ రెడ్డి అహంకారపూరిత వ్యాఖ్యలు
### అసెంబ్లీలో దుమారం
### బేషరతు క్షమాపణలకు కాంగ్రెస్ డిమాండ్
### గందరగోళం మధ్య సభ 15 నిముషాలు వాయిదా

హైదరాబాద్, మార్చి 13 (ప్రభాత ఉదయం): తెలంగాణ అసెంబ్లీలో భారాస ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగింది. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలని మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. తొలుత జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. 'ఈ సభ అందరిదీ.. సభ్యులందరికీ సమాన అవకాశాలు ఉన్నాయి. మా అందరి తరఫున పెద్ద మనిషిగా, స్పీకర్‌గా మీరు కూర్చున్నారు. ఈ సభ మీ సొంతం కాదు' అని వ్యాఖ్యానించారు. సభా సంప్రదాయాలకు విరుద్ధంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడారని స్పీకర్ ఆక్షేపించారు. జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. స్పీకర్‌ను దూషించేలా ఆయన మాట్లాడారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడిన ప్రతి పదాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన అహంకారంతో మాట్లాడకుండా క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు. భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు



మాట్లాడుతూ శ్రీధర్‌బాబు వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జగదీశ్‌రెడ్డి ఏం తప్పు మాట్లాడారని ప్రశ్నించారు. సభలో అందరికీ సమాన హక్కులు ఉన్నాయనడంలో తప్పులేదన్నారు. శాసనసభ అంటే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వానికి సంబంధించినది కాదన్నారు. ఈ క్రమంలో దళిత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్రంగా మండిపడ్డారు. దళితులంటే బిఆర్ఎస్‌కు పడదని, అందుకే స్పీకర్‌పై ..మిగతా 2లో



# డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం

### 22న జెఎసి సమావేశానికి రేవంత్‌కు డిఎంకె ఆహ్వానం
### పార్టీ ఆదేశాలు తీసుకుని వస్తానని వెల్లడించిన రేవంత్
### తెలంగాణలో అంతకుముందే అఖిలపక్ష భేటీ
### భేటీకి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికీ ఆహ్వానం.. ఢిల్లీలో సిఎం రేవంత్

న్యూఢిల్లీ, మార్చి 13 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలు తీసుకుని డిఎంకె నిర్వహించే జెఎసి సమావేశానికి హాజరవుతానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. డీలిమిటేషన్ కారణఃగా దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రఅన్యాయం జరుగబోతోందని అన్నారు. దీనిపై తెలంగాణ కాంగ్రెస్ కూడా అఖిలపక్ష భేటీని ఏర్పాట చేసిందన్నారు. దీనికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కూడా ఆహ్వానించామని అన్నారు. కేంద్ర కేబినేట్‌లో ఉన్న కిషన్ రెడ్డి దక్షిణాది రాష్ట్రాల ఇబ్బందులను కేంద్రానికి తెలియచేయాల్సి ఉందన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రేంవత్‌ని ఈ నెల 22న జరగనున్న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి హాజరు కావాలని తమిళనాడు డీఎంకే నేతలు ఆహ్వానించారు. ఈ క్రమంలో జేఏసీ సమావేశానికి రేవంత్ రెడ్డి రావాలని డీఎంకే ఎంపీలు కనిమొళి, రాజా, ఎన్. ఇలాంగో, కళానిధి వీరస్వామి సీఎంను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. స్టాలిన్ డీలిమిటేషన్ విషయంలో చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. తమిళనాడులో సమావేశానికి హాజరయ్యేందుకు ఏఐసీసీ అనుమతి ..మిగతా 2లో

# అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాటల యుద్ధం

### బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల విమర్శలు, ప్రతివిమర్శలు
### సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ మండిపాటు
### సీఎం క్షమాపణలు చెప్పాలని డిమాండ్

హైదరాబాద్, మార్చి 13 (ప్రభాత ఉదయం): అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడిచింది. స్టేచర్ అంశంపై ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. రేవంత్ రెడ్డిపై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదంటూ హస్తం నేతలు హెచ్చరికలు జారీ చేశారు. సీఎం రాష్ట్రానికి పెద్దన్న లాంటి వారని కాంగ్రెస్ నేతలు తెలుపగా.. రేవంత్ రెడ్డిని పిచ్చికుక్కలతో పోల్చారు బీఆర్ఎస్ శ్రేణులు. ఇంతకీ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎవరెవరు ఏం మాట్లాడాలో ఇప్పుడు చూద్దాం.

**కేటీఆర్ హుందగా మాట్లాడాలి : ఆది శ్రీనివాస్**

కేటీఆర్ హుందగా మాట్లాడాలని రాజకీయాల్లో హుందగా నడుచుకుంటేనే బాగుంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. స్టేచర్ గురించి ముందు మాట్లాడింది కేటీఆర్ అని.. సీఎం పదవి కంటే స్టేచర్ ఇంకేమైనా ఉంటుందా అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. "కేటీఆర్ మీకు నాయకుడు కావొచ్చు కానీ సీఎం రాష్ట్రానికి పెద్దన్న లాంటి వారన్నారు. తెలంగాణలో సీఎం పదవి కంటే ఇంకేమి స్టేచర్ ఉండదని స్పష్టం చేశారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకుడు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవుపలికారు. కేసీఆర్ కుటుంబంలో నలుగురు పదవులు తీసుకొని వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అందుకే ప్రజలు మీ స్టేచర్‌ను దింపి... సీఎంగా రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారన్నారు. 'హరీష్ రావు మీ నోరును అదుపులో పెట్టుకోండి. ఇష్టనుసారంగా మాట్లాడితే ఇక్కడ ఎవరు చూసుకుంటూ ఊరుకోరు.. 10 ఏళ్లు పందికొక్కులాగా రాష్ట్రాన్ని దోచుకున్న మీరు ..మిగతా 2లో



# ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటున్నాం

### అందుకే ఆ ముగ్గురికి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చాం
### గాంధీ కుటుంబంలో నాకుమంచి అనుబంధం..
### దానిని ఎవరి కోసం నిరూపించుకోవాల్సిన అవసరం లేదు : సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 13 (ప్రభాత ఉదయం): మేము ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానాలతోపాటు పార్టీలో కీలకంగా పనిచేసిన వారికి ఇచ్చిన మాటను నిబెట్టుకుంటున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్లు రానివారికి అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయం చేస్తానని హామీ ఇచ్చానని.. అవన్నీ ఇప్పుడు అమలు చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. గురువారం ఢిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడుతూ.. ..మిగతా 2లో

## ఉద్దేశ్యపూర్వకంగా సస్పెండ్ చేశారు

### మీడియా పాయింట్ వద్ద కెటిఆర్ ఆరోపణ



హైదరాబాద్, మార్చి 13 (ప్రభాత ఉదయం): జగదీశ్‌రెడ్డిని ఉద్దేశపూర్వకంగా సభ నుంచి సస్పెండ్ చేశారని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ తర్వాత భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ...స్పీకర్ పట్ల జగదీశ్‌రెడ్డి అగౌరవంగా మాట్లాడలేదు. అనని మాటను అన్నట్టుగా చిత్రీకరించారు. నిబంధనలకు విరుద్ధంగా సభలో ఏమీ మాట్లాడకపోయినా.. ఈ సమావేశాలు పూర్తయ్యే వరకు ఆయన్ను సస్పెండ్ చేయడం దారుణం అన్నారు. స్పీకర్ పట్ల ఎలాంటి వ్యాఖ్యలు ..మిగతా 4లో

## తెలంగాణలో ఐదు ఎమ్మెల్సీలు ఏకగ్రీవం



### ఎట్టకేలకు చట్టసభలోకి దాసోజు శ్రవణ్

హైదరాబాద్, మార్చి 13 (ప్రభాత ఉదయం): తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐదు స్థానాలకు 5 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్, భారాస నుంచి దాసోజు శ్రవణ్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం ఎన్నికయ్యారు. వీరు కాకుండా ఆరుగురు స్వతంత్ర ౦ ..మిగతా 3లో



## 15 నుంచి ఒంటిపూట బడులు

హైదరాబాద్, మార్చి 13 (ప్రభాత ఉదయం): తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9గంటల నుంచే భానుడి తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావటానికి జనం జంకుతున్నారు. రాబోయే రోజుల్లో తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో ప్రభుత్వం పాఠశాలల సమయంపై కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ క్రమంలో హాఫ్‌డే స్కూల్స్‌పై అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆదేశించింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు మాత్రమే పాఠశాలలు కొనసాగుతాయని పేర్కొంది. ఆ తర్వాత పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అందిస్తారని చెప్పింది. ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్, ఎయిడెడ్, ..మిగతా 2లో



## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి13(ప్రభాత ఉదయం)ధరూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల అవతారమెత్తి పాఠాలను బోధించారు. మరి కొందరు విద్యార్థులు డీఈవోగా, ఎంఈవోగా, హెచ్ఎంలుగా బాధ్యతలు నిర్వహించారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే జీవితంలో సాధించలేనిది ఏదీ ఉండదని ఎంఈఓ రవీందర్‌బాబు, హెచ్ఎం యోగేందర్ విద్యార్థులకు సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జాంపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రేవతి, ఉపాధ్యాయులు భార్గవి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఖాజాబీ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.




## ఈసీఐఎల్ గ్రౌండ్‌లో వాకర్స్‌కు అనుమతికి సిఎండి సానుకూలం

### ఎంపీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈసీఐఎల్ సిఎండిని కలిసిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

కుషాయిగూడ, మార్చి 13(ప్రభాత ఉదయం) ఈసీఐఎల్ గ్రౌండ్ లో వాకింగ్ నడక కోసం అవకాశం కల్పించాలని కోరుతూ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి లతో కలిసి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఈసీఐఎల్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వద్ద సిఎండి అనురాగ్ కుమార్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసీఐఎల్ ప్రాంగణంలో నడకకు ఈసీఐఎల్ కంపెనీ యాజమాన్యం అనుమతి నిరాకరించడంతో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ ప్రతినిధులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లి వాకర్స్కు అనుమతి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కాంటేకర్ రవీందర్,పోతగాని రాజు గౌడ్, అంజి, వెంకట్, వెంకట్ రెడ్డి, సంజయ్, మోహన్ రెడ్డి, సారంగ,నాయకులు మర్రి మోహన్ రెడ్డి నేమూరి మహేష్ గౌడ్, కనుకుల రజినీకాంత్ రెడ్డి, శ్రీశైలం, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాటల యుద్ధం

మొదటి పేజీ తరువాయి...

మాట్లాడుతున్నారా. ఈ రోజు 18 గంటలు కష్టపడి సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు జాగ్రత్తగా మాట్లాడాలి" అని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

**సీఎంను అగౌరవపర్చే విధంగా హరీష్‌రావు మాటలు : బీర్ల ఐల్లయ్య**

హరీష్‌రావు ముఖ్యమంత్రి కుర్చీని అగౌరవపరిచే విధంగా మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న గవర్నర్ ప్రసంగం అడ్డుకునే ప్రయత్నం చేశారని.. తెలంగాణ ప్రజానీకం గమనిస్తోందని తెలిపారు. ప్రజా ప్రతినిధుల్లా కాకుండా పందికొక్కుల్లా వ్యవహరిస్తున్నారంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యం, గవర్నర్, ముఖ్యమంత్రి అంటే బీఆర్ఎస్‌కు విలువలేదన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిని నిలబెట్టే స్థాయి లేని వారు ముఖ్యమంత్రి గురించి మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. వీళ్ళు పది సంవత్సరాలు చేయని అభివృద్ధిలో 15 నెలల్లో చేస్తే తల ఎక్కడ పెట్టుకోవాలో తెలుస్తలేదన్నారు. 'మీలా దొంగ దీక్షలు చేయలేదు. పెట్రోల్ దొరికినా అగ్గిపెట్టె దొరకలేదు అనే విధంగా మేము చేయలే. ప్రజల ఆదరణ చూసి ఓర్వలేక చిల్లర రాజకీయాలు చేస్తున్నారు.. నోరు అదుపులో పెట్టుకో. మీ బలుపు, వాపు మీ దగ్గరే పెట్టుకోండి. హరీష్ రావు తస్మాత్ జాగ్రత్త బిడ్డ. నిన్ను గ్రామాల్లో తరిమికొట్టే రోజులు ముందు ఉన్నాయి. మీరు చేసిన తప్పులు, అప్పులు సరిదిద్దుకుంటూ వస్తున్నాం. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం. ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. ఇది చూసి ఓర్వలేకే దిగజారుడు రాజకీయాలు. ఈరోజు రాష్ట్రం దివాలా తీయడానికి కారణం మీ మామ అల్లుళ్లు. సిగ్గులేకుండా ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రతిపక్ష హోదా నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీష్ రావు క్షమాపణలు చెప్పాలి' అంటూ ఐలయ్య డిమాండ్ చేశారు.

**సీఎం పదవి పరువుతీస్తున్న రేవంత్ : పాడి కౌశిక్ రెడ్డి**

ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతూ సీఎం పదవి రేవంత్ రెడ్డి తీస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి అన్నారు. ఇలానే మాట్లాడితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని ఇబ్బందులు పెడుతోందన్నారు. 4వేల పెన్షన్ వస్తుంది అనుకుంటే ఇప్పుడు 4 ఎకరాల పంట ఎండిపోతుంది అనుకోలేదని చిన్నపిల్లవాడు చెప్తుంటే గుండె తరుక్కుపోతుందన్నారు. పంటలు ఎండిపోతుంటే కనీసం నీళ్లు ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో వచ్చిన కరెంటు, రైతుబంధు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ మీద ఉన్న కక్ష్యతోనే పంటలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెడుతోందన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలో పంటలు ఎండిపోయి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీళ్లు వదలకపోతే రైతులను తీసుకొని తాను రోడ్డెక్కుతా అని హెచ్చరించారు. కేసీఆర్ కంటే గొప్ప పాలన చేసే ప్రయత్నం చేయాలి కానీ ఇలాంటి పరిస్థితులు రాకూడదన్నారు. 15 నెలల స్కాంగ్రెస్ పాలన.. 15 నెలలు 15 స్కాములు జరిగాయన్నారు. ఈ స్కాంగ్రెస్ పాలలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న తీరును ప్రజలు చూస్తున్నారన్నారు. 10 సంవత్సరాల పాలనలో తెలంగాణ అభివృద్ధిని దేశానికి చూపెట్టారు కేసీఆర్ అని అన్నారు. సిగ్గు, శరం లేకుండా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి విమర్శిస్తున్నారని మండిపడ్డారు. సభా ప్రతిపక్ష నేత చావు కోరుతున్నారన్నారు. వందల మంది ఎల్ఓపీ లీడర్లు అయ్యారు కానీ ఎవరు కూడా చావును కోరుకోలేదన్నారు. మొరిగే కుక్కలు మొరుగుతూనే ఉంటాయని.. కొండను చూసి కుక్కలు మొరిగితే కొండకు చేటా అని అన్నారు. 'కేసీఆర్ చావాలని నువ్వు కోరుకుంటున్నావు. కానీ కేసీఆర్ చచ్చే వ్యక్తి కాదు తెలంగాణను చావు నోట్లో తలపెట్టి తెచ్చిన వ్యక్తి కేసీఆర్. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేదా.. ఈ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి తర్వాత అయ్యేవాడా. నీకు రాజకీయ భిక్ష పెట్టింది కేసీఆర్ అనే విషయం గుర్తు పెట్టుకో' అని అన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. ప్రజలు పెడుతున్న శాపనార్థాలకు కుక్క చావు చచ్చేది రేవంత్ రెడ్డి అంటూ వ్యాఖ్యలు చేశారు. రైతులు రైతుబంధు రాలేదని, రుణమాఫీ కాలేదని నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నాయని ఒక జర్నలిస్టుకు ఇంటర్వ్యూ ఇస్తే ఆ జర్నలిస్టును బెయిల్ రాకుండా కేసులు పెట్టి జైలుకు పంపించారని.. ఇది ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. 'నువ్వు సక్కగా పాలన చేస్తే జర్నలిస్టులు రైతులు నిన్ను తిట్టేవారు కాదు కదా. ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ రేవంత్ రెడ్డి' అంటూ పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# దర్జాగా ఫిల్టర్ ఇసుక దందా

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి13(ప్రభాత ఉదయం) జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఫిల్టర్ ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ప్రభుత్వం అందించే ఇసుక కొరత ఉండటంతో జిల్లాలోని గద్వాల, ధరూర్, కేటిదొడ్డి, గట్టు,మల్దకల్ మండలాలో అక్రమార్కులు కృత్తిమ ఇసుక వ్యాపారానికి తెరలేపారు. మట్టి, మొర్రంను నీటి ద్వారా ఫిల్టర్ చేసి కృత్తిమ ఇసుకను తయారు చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగానే చర్చించుకుంటున్నారు. కొంత మంది అధికారులు, నాయకులు ఈ దందాకు సహకరించడంతో ఫిల్టర్ ఇసుక దందాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఫిల్టర్ ఇసుక తయారీతో సహజ వనరుల విధ్వంసం జరుగుతున్నా.. పట్టించుకొన్న నాధుడే కనిపించడంలేదని జిల్లా ప్రజలు ఆరోపిస్తున్నారు. అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఫిల్టర్ ఇసుక తయారీదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



**పట్టపగలే ఫిల్టర్ ఇసుక తయారీ**

ధరూర్ మండలం గూడెందొడ్డి రిజర్వాయర్ లో భాగంగా నిర్మించిన 99 ప్యాకేజ్ కాలువ నిర్మాణం అసంపూర్తిగా ఉ ఒడటం అక్రమార్కులకు వరమైంది. పార్చర్ల, గోనుపాడు గ్రామాల శివారులో ఆయకట్టు మట్టిని తవ్వి దానిని ఫిల్టర్ చేసి యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా చేస్తూ లక్షలు గడిస్తున్నారు. అయినా సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏదో అర్ధరాత్రి వేళలో ఈ దందా గుట్టుగా సాగడం లేదని, యథేచ్ఛగా పట్టపగలే వ్యవసాయ బోర్ల వద్ద ఫిల్టర్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక వ్యాపారులు సిండికేట్ గా మారి అధికారులను మచ్చిక చేసుకుంటూ తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారనే ఆరోపణలు ఉ న్నాయి.

**కాసులు కురిపిస్తున్న అక్రమదందా**

అక్రమంగా తయారు చేస్తున్న కృత్రిమ ఇసుక వ్యాపారం కాసులు కురిపిస్తుంది. కృత్రిమంగా తయారు చేసిన ఒక ట్రాక్టర్ ఇసుక రూ.5వేల వరకు స్థానిక మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. బయట మార్కెట్‌లో మేలు రకం నది ఇసుక ట్రాక్టర్‌కు రూ.6వేలు ధర పలుకుతుంది. అక్రమార్కులు మట్టిని ఫిల్టర్ చేసి తయారు చేసిన కృత్రిమ ఇసుకను డంపులు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాక్టర్ లలో కృత్రిమ ఇసుకను నింపి పైన నదీ ఇసుకను కలిపి విక్రయిస్తున్నారు. దీంతో దళారుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది.

**నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం**

ప్రభుత్వం రైతులకు అందిస్తున్న 24 గంటల కరెంటు ఫిల్టర్ ఇసుక వ్యాపారాలకు గొప్ప వరంగా మారిందని చెప్పుకోవచ్చు. పంటలు పండించుకోవడానికి రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత విద్యుత్తు కొంతమంది వ్యాపారులకు వరంగా మారింది. ఫిల్టర్ ఇసుక మాఫియా గ్యాంగ్ ఇసుకను ఫిల్టర్ చేయడానికి ప్రభుత్వం వ్యవసాయానికి ఉచితంగా సరఫరా చేసే కరెంటును వినియోగించుకొని, బోరు ద్వారా మోటార్లతో మట్టి నుంచి ఇసుకను తీసి ఒక దగ్గర స్టోరేజ్ చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. కరెంటు మీటర్లు లేకుండా ఎలక్ట్రికల్ వారి పర్మిషన్ లేకుండా అక్రమంగా 24 గంటలు కరెంటు వాడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వాన్ని కళ్ళు గప్పి, ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తూ ఉచిత విద్యుత్తును అక్రమ మార్గంలో వాడుకుంటూ దందాలో లక్షలు గడిస్తున్నారు.

## ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటున్నాం

మొదటి పేజీ తరువాయి...

పార్టీ అనుబంధ విభాగాల్లో పని చేసిన వారికి ఒకేసారి 37 కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చానన్నారు. అలాగే అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్‌కు ఎమ్మెల్సీలు ఇచ్చామన్నారు. డీసీసీ అధ్యక్షులందరికీ పదవులు ఇచ్చామని తెలిపారు. గాంధీ కుటుంబంతో తనకు అనుబంధం అంతకు మించి ఉందని.. ఫొటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర కేబినెట్‌లో ఉన్న నిర్మలా సీతారామన్ గతంలో తమిళనాడుకు మెట్రో ప్రకటనలో కీలక పాత్ర పోషించారన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాత్రం తెలంగాణ రాష్ట్రం అంశాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు 253 ఎకరాల భూసేకరణ పూర్తి చేస్తామన్నారు. మెట్రో, మూసీ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతిస్తే సరిపోతుందని.. బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. తెలంగాణలో ఏప్రిల్ నెలలో మూడు రోజుల పాటు భారత్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 60 దేశాల నుంచి అతిథులను ఆహ్వానిస్తున్నామన్నారు. దానికి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి అనుమతి కావాలని.. అందుకే విదేశాంగ శాఖ మంత్రిని కలుస్తున్నట్లు తెలిపారు. డీలిమిటేషన్ విధానంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జానారెడ్డి నేతృత్వంలో కమిటీ వేశానన్నారు. దానికి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని ఆహ్వానిస్తున్నామన్నారు. తెలంగాణలో అందరి అభిప్రాయాన్ని సేకరించి ఆ తర్వాత డీఎంకే మీటింగ్‌లో తమ వైఖరి చెప్తామన్నారు. పన్నులు వసూలులో దేశంలో మొదటి స్థానంలో తెలంగాణ ఉ ఒదన్నారు. బీఆర్ఎస్ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. పంటలు ఎండిపోయినా, ప్రజలు ప్రాణాలు పోతున్నా బీఆర్ఎస్ నేతలు డ్యాన్సులు వేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సభ అందరిదీ.. మీ సొంతం కాదు

మొదటి పేజీ తరువాయి...

అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. జగదీశ్ రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సభలో గందరగోళం నెలకొంది. జగదీశ్ రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందేనని అధికార పార్టీ సభ్యులు గట్టిగా డిమాండ్ చేసారు. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ సభను 15 నిముషాలు వాయిదా వేశారు. అంతకుముందు మంత్రి కోమటి రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మధ్య కాసేపు మాటల తూటాలు పేలాయి. పదేళ్లలో ఏమీ చేయలేని బిఆర్ఎస్..ఇవాళ కాంగ్రెస్‌ను తప్పుపడుతోందని మంత్రి కోమటిరెడ్డి మండిపడ్డారు. రుణమాఫీ, రైతుభరోసాపై ప్రభుత్వం విమర్శలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి కామెంట్స్ కు మంత్రి కోమటి రెడ్డి కౌంటర్ ఇచ్చారు.రైతు భరోసా ఎప్పుడిచ్చారు,రుణమాఫీ ఎక్కడ చేశారు. ఆడపిల్లలకు స్కూటీ ఇచ్చారు. గవర్నర్ 36 నిమిషాల ప్రసంగంలో 360 అబద్దాలు చెప్పారు. ప్రతిపక్షాలు మాట్లాడుతుంటే అధికార పార్టీ నేతలు రన్నింగ్ కామెంట్రీ చేయడం మానుకోవాలని జగదీష్ రెడ్డి సూచించారు.జగదీష్ రెడ్డి కామెంట్స్ కు మంత్రి కోమటి రెడ్డి కౌంటర్ ఇచ్చారు. దళితుడిని సీఎం చేస్తామని బీఆర్ఎస్ చేసిందా? మూడెకరాల భూమి ఇస్తామని ఇచ్చిందా?ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ పూర్తి చేసినవేనన్నారు. బీఆర్ఎస్ చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందన్నారు. ఇచ్చిన హామీలన్నీ తప్పకుండా అమలు చేస్తాం. మీరు పదేళ్లలో చేయలేనిది..తాము 14 నెలల్లో చేశామని కోమటిరెడ్డి అన్నారు.

## 15 నుంచి ఒంటిపూట బడులు

మొదటి పేజీ తరువాయి...

ప్రైవేటు పాఠశాలకు హాఫ్ డే ఉంటుందని.. ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక పదో తరగతి వార్షిక పరీక్షలు జరిగే పాఠశాల్లో మాత్రం తరగతులు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయని పేర్కొంది. ఈ మేరకు పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులను తెలియజేయడంతో పాటు అమలును స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్ట్ ఆదేశించారు.





## సాగునీటి సరఫరా సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి13(ప్రభాత ఉదయం) సాగునీటి సరఫరా సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కేటీ దొడ్డి మండలం కొండాపురం గ్రామంలో నీటి కొరతతో ఎండిపోతున్న పంటలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పొలాల్లో పర్యటించి పంటల పరిస్థితిని పరిశీలించారు. వరి పంటలు నీటి కొరత కారణంగా తీవ్రంగా ప్రభావితమవుతున్నట్లు గుర్తించారు. ర్యాలంపాడు ఎడమ ప్రధాన కాలువ 104 ప్యాకేజీ పరిధిలోని కొండాపురం, గువ్వలదిన్నె, మైలగడ్డ గ్రామాల వద్ద కాలువ ప్రవాహాన్ని, నీటి సరఫరా పరిస్థితిని పరిశీలించారు. కాలువలో నీటి విడుదల, పంపిణీ విధానం, ఆయకట్టు పరిధిలోని ప్రాంతాలకు నీరు చేరుతున్న తీరును తెలుసుకునేందుకు అక్కడి పంపింగ్ స్టేషన్లు మరియు పంపిణీ వ్యవస్థను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడి రైతుల అభ్యర్థన మేరకు తక్షణమే సాగునీటిని కాలువల్లోకి విడుదల చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కాలువల ద్వారా సరఫరా అవుతున్న నీరు ఆయకట్టు చివరి ప్రాంతాలకు కూడా అందేలా సమతుల్యతను పాటించాలనీ సూచించారు. కాలువల ద్వారా నీరు ఆయకట్టు చివరి ప్రాంతాలకు చేరకుండా ఎగువ ప్రాంతాల్లోని రైతులు మోటార్లు, పంప్ సెట్లు ఉపయోగించి నీటిని వినియోగిస్తున్న పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు. ఇలా కాకుండా కాలువల వెంట నీటి వినియోగాన్ని సమతుల్యంగా నిర్వహించే విధంగా చూడాలన్నారు. నీటి ప్రవాహం చివరి ఆయకట్టు వరకు చేరే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుందని, వారి పంటలను కాపాడేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. తక్షణమే అవసరమైన చర్యలు తీసుకొని సాగునీటి సరఫరా పద్ధతులను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈ.ఈ రహీముద్దీన్, వ్యవసాయ అధికారి సక్రియ నాయక్,ఏడీఏ సంగీత లక్ష్మి ,విద్యుత్ శాఖ ఎ.డి. రమేష్ బాబు, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.




## బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల సౌకర్యార్థం సరిహద్దు బోర్డులు ఏర్పాటు

కూకట్‌పల్లి, మార్చి 13 (ప్రభాత ఉదయం) బాలా నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే ప్రజల సౌకర్యా ర్థం, స్థానికులకు పోలీస్ స్టేషన్ సరిహద్దుల గురించి అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో బాలానగర్ సిఐ నరసింహ రాజు పోలీసు స్టేషన్ అధికార పరిధిలను సూచించే బోర్డులను ఏర్పాటు చేశారు. గురువారం బాలానగర్ ఏసీపీ హనుమంతరావు చేతుల మీదుగా ఐడిపిఎల్ కూడలిలో ఈ బోర్డులను ప్రజల అవసరార్థం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాంనారాయణ, సరళ, ఏఎస్ఐ ప్రభాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ హనుమంతరావు మాట్లాడుతూ,"ఈ నెట్వర్క్ ఏర్పాటుతో ప్రజలకు తమ ప్రాంతం ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో తెలుస్తుంది. దీనివల్ల వారు తమ సమస్యలను సంబంధిత పోలీస్ స్టేషన్లో త్వరగా పరిష్కరించుకోవచ్చు" అని అన్నారు. అనంతరం సిఐ నరసింహరాజు మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ స్టేషన్ పరిధి గురించి అవగాహన కల్పించడం చాలా ముఖ్యమన్నారు. దీనివల్ల నేరాలు తగ్గుతాయి, ప్రజలకు పోలీసులకు మధ్య సంబంధాలు మెరుగుపడతాయి అని పేర్కొన్నారు. ఈ బోర్డులపై పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రాంతాలు, వీధులు, కూడళ్ల వివరాలతోపాటు పోలీస్ స్టేషన్, అధికారుల ఫోన్ నెంబర్లు సమకూర్చమన్నారు. ఈ బోర్డులు ప్రజలకు చాలా ఉ పయోగకరంగా ఉంటాయని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

## డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం

మొదటి పేజీ తరువాయి...

తీసుకుని వస్తామన్నారు. డీలిమిటేషన్ పక్రియ దక్షిణాది రాష్ట్రాలపై ప్రభావం చూపుతుందని, ఉత్తరాది రాష్ట్రాల కంటే ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నాయని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూడా డీలిమిటేషన్ పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కూడా రావాలని కోరుతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో కిషన్ రెడ్డి తన అభిప్రాయాలను కేంద్ర క్యాబినెట్‌లో వినిపించాల్సిన అవసరం ఉందని రేవంత్ ప్రస్తావించారు. తెలంగాణలోని అన్ని పార్టీలు కూడా ఆ సమావేశంలో పాల్గొనాలని కోరారు. ఈ క్రమంలో డీలిమిటేషన్ పై మార్చి 22న జరుగనున్న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి ముఖ్యమంత్రికి ఆహ్వానం అందింది. తమిళనాడులో జరగనున్న ఈ సమావేశానికి పలు ప్రాంతీయ పార్టీలు హాజరై డీలిమిటేషన్ పై వారి అభిప్రాయాలను తెలియజేయనున్నాయి. ఇప్పటికే డీలిమిటేషన్ పై తమిళనాడు డీఎంకే నేతలు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ పక్రియ తమ రాష్ట్రంలో ప్రజల హక్కులను హరించే దిశగా ఉందని వ్యాఖ్యానించారు.

## గ్రామీణ నియోజకవర్గాలలో

# అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు

### రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష






గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి13(ప్రభాత ఉదయం)యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామీణ నియోజకవర్గాలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) ఏర్పాటు చేయాలని సంకల్పించిందని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో 70 ఏటీసీ కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ఇదే తరహాలో ఐ.టి.ఐ, ఏ.టీ.సీ సెంటర్లు లేని ప్రతి గ్రామీణ ప్రాంత అసెంబ్లీ సెగ్మెంట్ లో కనీసం ఒకటి చొప్పున అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఏటీసీ సెంటర్ల నిర్మాణానికి అనువైన ప్రదేశం, స్థలాన్ని గుర్తిస్తూ సమగ్ర వివరాలతో కూడిన నివేదికలను త్వరితగతిన సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో సుమారు 45 ఏటీసీ కేంద్రాలను గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలలో నెలకొల్పాలని ప్రభుత్వం నిర్దేశించిందని అన్నారు. రోడ్డు, రవాణా వసతితో పాటు సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపిక చేస్తే ఏటీసీ కేంద్రాలలో విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు, ఇన్ స్ట్రక్టర్లు సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని సూచించారు. అంతేకాకుండా స్థానిక పరిశ్రమలకు చేరువలో ఏటీసీలను ఏర్పాటు చేసినట్లయితే, సంబంధిత పారిశ్రామిక అంశాలతో కూడిన ట్రేడ్లలో యువతకు శిక్షణ అందించేలా ప్రణాళికలు చేపట్టవచ్చని అన్నారు. తద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే యువతకు స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు లభించేందుకు దోహదపడినట్లు అవుతుందన్నారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుంటూ అనువైన ప్రదేశాలలో అందుబాటులో ఉన్న స్థలాల వివరాలతో కూడిన నివేదికలను వెంటనే పంపాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ సూచించారు. జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ మాట్లాడుతూ.. జిల్లాలోని అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలలో ఏ.టీ.సీ కేంద్రాల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న మూడు ఎకరాల స్థలాన్ని గుర్తించడం జరిగిందని, పూర్తి వివరాలతో కూడిన నివేదికను సోమవారం లోపు పంపిస్తామని తెలిపారు. జూమ్ మీటింగ్ లో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

## కాంగ్రెస్ నాయకులు సానెం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

బుద్వేల్, మార్చి 13(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ లోని దుర్గా నగర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో గురువారం సాయంత్రం టీపీసీసీ కార్యదర్శి సానెం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ పార్టీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు.... 30 రోజులు ముస్లిం సహోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాసముండి రోజుకు ఐదుసార్లు ప్రార్థనలు చేస్తారని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు.శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ పార్టీ ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలిపారు.



## పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో రాణించాలి: కాలకుంట్ల స్వాతి

కూకట్‌పల్లి, మార్చి 13 (ప్రభాత ఉదయం) మహిళలు రాజకీయంగా ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలని కాలకుంట్ల స్వాతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలానగర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కాల కుంట్ల స్వాతీ, తులసి, సోనీ సుజాత, సుమలత, పి.స్వాతి, భాగ్య, పవిత్ర, మమత నేతృత్వంలో బాలానగర్ డివిజన్ చరబండ రాజు కాలనీ కమ్యూనిటీ హాల్ లో అంగరంగవైభవంగా ప్రపంచ మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను ఆమె సన్మానించారు. అనంతరం కాలకుంట్ల స్వాతి మాట్లాడుతూ పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో పోటీపడాలన్నారు. ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాలలో రాణించడానికి ప్రోత్సహించింది అన్నారు. మహిళలు లేని ఇల్లు దీపం లేని కోవెల తో సమానం అని, మహిళలు ఇంటిని చక్కదిద్దే విషయంలో ఎంత శ్రద్ధ చూపిస్తారో దేశభక్తిలో కూడా అంతే శ్రద్ధ చూపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సునీత, రాములమ్మ, చిట్టెమ్మ, పి.లక్ష్మీ, మంగమ్మ, పి. చిట్టెమ్మ, అనిత, శీరిష తదితరులు పాల్గొన్నారు.ం



## అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేసిన జిహెచ్ఎంసి అధికారులు

రాజేంద్రనగర్, మార్చి13(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో జిహెచ్ఎంసి అనుమతి లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులకు వేశారు. సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ అంబియన్స్ పోర్ట్, మైలార్దేవ్పల్లి జిల్లాలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందడంతో డిప్యూటీ కమిషనర్ కే రవికుమార్ అధికారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి కూల్చేయాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు తమ సిబ్బందితో కలిసి పలు ప్రాంతాలలో జరుగుతున్న అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేశారు.





హైదర్ గూడ బాబు జగ్జీవన్ రాం కమ్యూనిటి హాల్ వద్ద కాముని దహనం చేస్తున్న ఎం బాలసుబ్రమణ్యం, తదితరులు



హైదర్ గూడ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద కామ దహనం చేస్తున్న బస్తీ పెద్దలు

## తెలంగాణలో ఐదు ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

మొదటి పేజీ తరువాయి...

అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు నిబంధనల మేరకు లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి వాటిని తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం సాయంత్రం 5గంటలకు ముగిసింది. దీంతో ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. దాసోజు శ్రవణ్ ఎట్టకేలకు చట్టసభలో ప్రవేశించే అవకాశం దక్కించుకున్నారు. గతంలో గవర్నర్ కోటాలో దాఓజును నామినేట్ చేసినా ఆనాటి గవర్నర్ తమిళసై తిరస్కరించడంతో ఆయన అవకాశం కోల్పోయారు.




## నూతన జాతీయ మార్కెటింగ్ ముసాయిదాను రద్దు చేయాలి

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి13(ప్రభాత ఉదయం)ఎన్డీఏ కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ పీ చట్టం, రుణ విముక్తితోపాటు రైతులకు ఇచ్చిన హామీలు అన్నిటినీ అమలు చేసి, నూతన జాతీయ మార్కెటింగ్ ముసాయిదాను రద్దు చేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.గోపాల్ డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) జాతీయ కమిటీ పిలుపులో భాగంగా గురువారం కేటిదొడ్డి మండల కేంద్రంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా జి గోపాల్ మాట్లాడుతూ%% కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని రద్దు చేయాలని, మూడు వ్యవసాయ చట్టాలను మళ్లీ అమల్లోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని తెలియజేశారు. కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులలో కోత విధించిందని, ఎరువుల సబ్సిడీలో తగ్గింపు చేసిందని ధరల స్థిరీకరణ నిధి పెంచలేదని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతాంగానికి ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టలేదని అన్నారు. మార్కెట్ విధానాన్ని అమలు చేయమని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని, పార్లమెంటులో దీన్ని వ్యతిరేకించాలని మాట్లాడారు. గట్టు ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని, జూరాల ప్రాజెక్టు లో పూడిక తీసివేయాలని, ఆర్డీఎస్ 15.9 టీఎంసీలు వాటా చివరి ఆయకట్టువరకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవిందు, మల్లయ్య , నర్సింలు, గోపాల్, ఆంజనేయులు, రంగప్ప, నర్సింలు, స్వామి, హనుమేష్, తదితర రైతులు పాల్గొన్నారు

## పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి13(ప్రభాత ఉదయం)ధరూర్ మండలం పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం వారి హుండీని గురువారం లెక్కించారు. దేవాదాయ శాఖ పరిశీలకురాలు వెంకటేశ్వరీ, ఆలయ ధర్మకర్త సి.గిరిరావు, ఈఓ కవిత, ఆలయ ప్రధాన అర్చకులు కిష్టాచారి సమక్షంలో హుండీని లెక్కించగా రూ.9,38,200 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.



## గద్వాలలో ముందస్తు హోలీ సంబరాలు





గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి13(ప్రభాత ఉదయం)గద్వాల పట్టణంలోని వివిధ పాఠశాలలో గురువారం ముందస్తు హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక భీంనగర్ లో గల విశ్వం అక్షర కాన్సెప్ట్ పాఠశాలలో ముందస్తు హోలీ సంబరాలను ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కాముని దహనం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్, డైరెక్టర్ హరిత, ప్రిన్సిపల్ రత్నం హోలీ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఫతేనగర్ డివిజన్ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ కి వినతిపత్రం అందించిన కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

కూకట్‌పల్లి, మార్చి 13 (ప్రభాత ఉదయం) ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఉన్న సమస్యలపై గురువారం ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ని కలిసి పెండింగ్లో ఉన్న స్మశాన వాటిక నిధుల కొరకు, దీన్ దయాల్ నగర్, నాగార్జున కాలనీ, భరత్ నగర్ కాలనీ లోని ఎల్ఐజి మిగతా బస్తీల్లో కాలనీలో రోడ్ల కొరకు వినతి పత్రం అందించారు. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ అతి త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



## కెపిహెచ్‌బి కాలనీ ఫోర్త్ ఫేస్ వెంచర్2లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి

### కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి, మార్చి 13 (ప్రభాత ఉదయం) కెపిహెచ్‌బి కాలనీ ఫోర్త్ ఫేస్ వెంచర్ 2 కి సంబంధించి ఫైనల్ కాస్ట్, అధిక వడ్డీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ ప్రతినిధులు, నివాసితులు గురువారం కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ని జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఫోర్త్ ఫేస్ వెంచర్ 2 లోని ఫ్లాట్స్ కు హౌసింగ్ బోర్డ్ అధికారులు ఫైనల్ కాస్ట్ విషయంలో అధికంగా రేటు నిర్ణయిస్తున్నారని, వడ్డీ సైతం అధికంగా వేస్తూ తమను ఆందోళనకు గురి చేస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని రమేష్, కి వారు విజ్ఞాపన పత్రం అందజేశారు. దీనిపై రమేష్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యను మంత్రి దృష్టికి అవసరమైతే సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్తానని బాధితులకు హామీ ఇచ్చారు. దీంతో నివాసితులు హర్షం వ్యక్తం చేశారు.



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న నాయకులు

## విద్యార్థుల మౌలిక సదుపాయాల కల్పనకు భాగస్వాములు కావాలి

### సి డి సి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి

కొత్తకోట, మార్చి 13(ప్రభాత ఉదయం) ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని విద్యార్థుల విద్యాభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సిడిసి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం రాష్ట్ర గ్రామీణ సంక్షర్త మిషన్ ఆధ్వర్యంలో గుంటి నాగేష్ సాగర్ సహకారంతో రామకృష్ణాపురం గ్రామ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యాభివృద్ధి తోనే సమాజాభివృద్ధి జరుగుతుందని అందుకోసం విద్యార్థుల తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్ రెడ్డి ,లోకా రెడ్డి ,బి శివ రాములు యాదవ్ ,రిటైర్డ్ టీచర్ శేఖర్ , మాజీ వైస్ ఎంపీపీ రాములు ,రామ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు జి నాగరాజు, గుంటి నరసింహ సాగర్, మున్నూరు వెంకటన్న, రవికుమార్ ,మధుగం భారతయ్య, నారాయణ, సంధ్య పగా మాసన్న , ఎస్ వెంకటేష్ ,మధుగం మొగులన్న ,ఉప్పరి రవికుమార్ ,గొబ్బూరి శీను సాగర్, తదితరులు పాల్గొని బ్యాగుల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమ్ రావు ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లు అధ్యాపక బృందం , విద్యా అభిమానులు పాల్గొని గ్రామం తరపున పాఠశాల తరపున ధన్యవాదాలు తెలియజేశారు.





## మద్యం మత్తులో కన్నతల్లిని కడ తేర్చిన ప్రకాష్

### ఆస్తి పత్రాలు ఇవ్వలేదని కర్రతో బాది గ్యాస్ సిలిండర్ తో దాడి

శంషాబాద్, మార్చ్ 14( ప్రభాత ఉదయం) తాగుడుకు బానిసగా మారిన ఓ యువకుడు తాగిన మైకంలో కన్ను మిన్ను కానక కన్నతల్లి పై విచక్షణారహితంగా దాడి చేసి ఆమె ప్రాణాలు తీశాడు. ఈ సంఘటన శంషాబాద్ ఆర్ జి ఐ ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాల్లగూడలో బుధవారం రాత్రి జరిగింది. ఆర్జిఐఏ ఇన్స్పెక్టర్ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం రాల్లగూడ సమీపంలోని రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్న రాచమల్ల చంద్రకళ కు ఇద్దరు కొడుకులు. కుటుంబ సభ్యులతో కలిసి ఆమె నివాసం ఉంటుంది. ఆమె పెద్ద కుమారుడు ప్రకాష్ మద్యానికి బానిసగా మారాడు. వీళ్ళ పాల లేకుండా ఇష్టానుసారంగా మద్యం తాగుతూ డబ్బుల కోసం తరచుగా తల్లిని వేధించేవాడు. ఆస్తి పత్రాలు ఇవ్వాలని గత కొన్ని రోజులుగా తల్లిని వేధిస్తున్నప్పటికీ ఆమె పత్రాలు ఇవ్వలేదు. దీనితో ఆగ్రహానికి గురైన ప్రకాష్ మద్యం మత్తులోనే కర్ర తీసుకొని తల్లి పై దాడి చేశాడు. దెబ్బలకు తాళలేక ఆమె కింద పడిపోగానే గ్యాస్ సిలిండర్ తో తలపై మోదాడు. దీనితో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. ఆర్జిఏ పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు.

## కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డికు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



కొత్తకోట, మార్చి 13(ప్రభాత ఉదయం) రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ జన్మదిన వేడుకలకు వనపర్తి రోడ్డు మాజీ మార్కెట్ చైర్మన్ ఎస్ బాల నారాయణ, మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి ,చిలుక నరసింహారెడ్డి లు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు.



హెూలీ సందర్భంగా రంగులు చల్లుకున్న బ్యాంకు అధికారులు,ఉద్యోగులు

## బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖైరతాబాద్ బ్రాంచ్‌లో హెూలీ

### ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు


ఖైరతాబాద్, మార్చి13(ప్రభాత ఉదయం) బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖైరతాబాద్ బ్రాంచ్ లో గురువారం హెూలీ పండుగను ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. బ్యాంకు వేళలు ముగిసిన తర్వాత ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు ఒక రిపై ఒకరు రంగులు చల్లుకొని హెూలీ పండుగను జరుపుకున్నారు.

# జర్నలిస్టుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

### అప్పులు చేసి చికిత్స పొందుతున్నారు

### డిప్యూటీ సియంకు టీయూడబ్ల్యూజే విజ్ఞప్తి

### సానుకూలంగా స్పందించిన భట్టి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న టి యు డబ్ల్యూ జె రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ

హైదరాబాద్‌బీమార్చి13 (ప్రభాత ఉదయం) గత ఐదేళ్లుగా రాష్ట్రంలో జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుకాక పోవడంతో, అప్పులు చేసి చికిత్స పొందే పరిస్థితి నెలకొందని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందే ఆర్థిక స్తోమత లేక ఇప్పటికే పలువురు జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ప్రతినిధి బృందం వాపోయింది. గురువారం నాడు అసెంబ్లీ లాబిలో ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం కలిసి జర్నలిస్టుల ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళింది. గత ప్రభుత్వం 2015లో ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు అందించిన హెల్త్ కార్డులు కొంతకాలం ఎంతో ప్రయోజనం చేకూర్చాయని, గడిచిన ఐదేళ్లుగా ఆసుపత్రుల్లో అవి చెల్లకపోవడంతో, అనారోగ్యలకు గురవుతున్న జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పడరాని తిప్పలు పడుతున్నట్లు విరాహత్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా అమలుచేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల మెనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పొందుపర్చడంతో జర్నలిస్టులు ఎంతో సంతోషపడ్డారని ఆయన గుర్తుచేసారు. అయితే ఇంకా అది అమలుకాక పోవడంతో జర్నలిస్టులు నిరాశ చెందుతున్నట్లు ఆయన తెలిపారు. వెంటనే ఆరోగ్య పథకాన్ని అమలు పరిచి, జర్నలిస్టుల అకాల మరణాలను ఆపేందుకు చర్యలు చేపట్టాలని విరాహత్ అలీ కోరారు. అలాగే రాష్ట్రంలో జర్నలిస్టులు తమ విధులను సజావుగా నిర్వహించేందుకు, సంఘ వ్యతిరేక శక్తుల నుంచి వారికి రక్షణ కల్పించేందుకు, జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు అనేక జీవోలు తెచ్చి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాయని, రాష్ట్ర విభజన తర్వాత ఆ కమిటీలు నిర్వీర్యమై పోయినట్లు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వేజ్ బోర్డు సిఫార్సుల అమలును పర్యవేక్షించే త్రైపాక్షిక కమిటీ, వర్కింగ్ జర్నలిస్ట్స్ వేల్ఫేర్ ఫండ్ కమిటీ, జర్నలిస్టులపై దాడుల నివారణకు హైపవర్ కమిటీతో పాటు ఇతర కమిటీలను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వినతి పత్రాన్ని అందించారు. టీయూడబ్ల్యూజే వినతిపై డిప్యూటీ సియం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టులకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందన్నారు. యూనియన్ ప్రతినిధి బృందంతో త్వరలో సమావేశమై సమస్యలపై కులంకుశంగా చర్చిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. డిప్యూటీ సియంను కలిసిన ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కలుకూరి రాములు, జర్నలిస్ట్స్ హెల్త్ కమిటీ కన్వీనర్ ఏ.రాజేష్, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు రజనీకాంత్ తో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఉద్దేశ్యపూర్వకంగా సస్పెండ్ చేశారు

మొదటి పేజీ తరువాయి...
చేయలేదని, తాను చేసిన తప్పేంటని వివరణ అడిగే అవకాశం కూడా జగదీశ్‌రెడ్డికి ఇవ్వలేదు. స్పీకర్ బాధపడి ఉంటే విచారం వ్యక్తం చేయాలని, సభ సజావుగా జరిగేందుకు సహకరించాలని ఆదేశించాలన్నారు. ఇదే విషయాన్ని స్పీకర్, మంత్రి శ్రీధర్‌బాబుకు స్పష్టంగా చెప్పాం. అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని కోరాం. అయినా, పట్టించుకోకుండా నియంతృత్వ పోకడలతో సభను 5 గంటలపాటు వాయిదా వేశారు. ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు మంత్రులతో మాట్లాడించి.. జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకుంటారని కేటీఆర్ అన్నారు.



## మధువన్ కాలనీలో కామ దహనం

రాజేంద్రనగర్, మార్చి13(ప్రభాత ఉదయం) మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెూలీ పండుగ ఉత్సవాలలో భాగంగా కామ దహనం కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజలకు హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు బుచ్చిరెడ్డి, విజయ్ కుమార్ యాదవ్, సామల సతీష్, బాలస్వామి, రాజేష్, నాని, ఉత్తం, కిషోర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు

### నివాళులు అర్పించిన ప్రకాష్ గౌడ్, కార్తీక్ రెడ్డి





శంషాబాద్,మార్చ్ 13 ( ప్రభాత ఉదయం ) రచయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను శంషాబాద్ మండల కుమ్మరి సంఘం అధ్యక్షుడు కోనమోల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రాజేంద్రనగర్ ఇన్చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ముల్లమాంబ చిత్రపటానికి నివాళులు అర్పించారు. శంషాబాద్ లో కుమ్మరి సంఘం భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హామీ ఇచ్చారు. దీంతోపాటు ఆమె విగ్రహం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించడానికి అధికారులతో మాట్లాడుతానని పేర్కొన్నారు. కవి రచయిత్రి మొల్లమాంబ భావితరాల వారికి ఆదర్శప్రాయురాలని ఆయన కొనియాడారు. అనంతరం టిఆర్ఎస్ పార్టీ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మల్లమాంబ చిత్రపటానికి నివాళులు అర్పించి కుమ్మరి సంఘం నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. అందరూ కలిసికట్టుగా ఏకతాటిపై ఉండే భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని సూచించారు. తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని స్పష్టం చేశారు. కుమ్మరులకు రాజకీయంగా తగిన ప్రోత్సాహాన్ని అందజేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుష్మా మహేందర్ రెడ్డి. దూడల వెంకటేష్ గౌడ్, కోడిగంటి చంద్రారెడ్డి. నీరటి రాజూ ముదిరాజ్. రాపోలు పెంటన్న. వెంకటేష్. కొనమోల భారతమ్మ. చేవెళ్ల ప్రసాద్. కుమ్మరి సంఘం టౌన్ అధ్యక్షుడు నరేష్ కుమ్మరి. శేఖర్ బాలరాజు- కోశాధికారి కోణమొల్ల దేవేందర్- సలహా దారు . మహేష్ బాబు . కె.కుమార్. శ్రీకాంత్.రమేష్ పాండు. భరత్. సత్తయ్య . షాములు. పెదిరిపాటి మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు



## నేడు హైదరాబాద్ ఆర్టీసీ డిపో-1లో డయల్ యువర్ డిఎం కార్యక్రమం

### ఆర్టీసీ ప్రయాణికుల సూచనలు సలహాలు స్వీకరణ

హైదరాబాద్ (గౌలిగూడ),మార్చి13(ప్రభాత ఉదయం) ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సర్వీస్ అందించేందుకు డైల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ ఆర్టీసీ డిపో-1 మేనేజర్ బి కృష్ణారెడ్డి తెలిపారు. గౌలిగూడ లోని హైదరాబాద్-1 డిపో నుండి నడిచే సర్వీసులకి సంబంధించి ప్రయాణికుల సలహాలు, సూచనలు మరియు సమస్యలు స్వీకరించేందుకు 14వ తేదీ ( శుక్రవారం ) సాయంత్రం 4:00 గంటల నుండి 5:00 గంటల వరకు " డయల్ యువర్ డీయమ్ " కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. రాయచూరు, కర్నూల్, నంద్యాల, బెంగళూరు, సేడం, యాదగిర్, గుల్బర్గా, ఆదిలాబాద్, షోలాపూర్, నాగపూర్ తదితర రూట్లలో తిరిగే బస్సు సర్వీసులకు సంబంధించిన ఫిర్యాదులు సలహాలు తెలియజేసేందుకు 9959226248 నంబర్ కి ఫోన్ చేయాలనీ కోరారు.

## స్నేహం వల్ల లాభాలు

స్నేహం చేయడం వలన మనసు కి తనువుకి ఆరోగ్యకరం అంటున్నాయి చాలా అధ్యయనాలు.

స్నేహితులు ఉన్నవాళ్ళకి మధుమేహం గుండె జబ్బులు వచ్చే అవకాశాలు తక్కువ.

స్నేహ బంధాలు ఉన్నవాళ్లకి కష్టాలు కన్నీళ్లు ఒత్తిళ్లు మనసులోనే పెట్టుకుని కొమిలి పోవాల్సిన పనిలేదు.

అన్ని పంచుకున్నప్పుడు మెదడులో ఆక్సిటోసిన్ స్థాయి పెరిగి మనసు తేలిక పడుతుంది.

2010లో అమెరికాలో చేసిన అధ్యయనంలో స్నేహితులు ఎక్కువ ఉన్నవారికి మరణం త్వరగా రాదని తేలింది. మీరు మంచి స్నేహితులని వదులుకోవద్దు. ఓకేనా ఫ్రెండ్స్,

సేకరణ,

షమీం సుల్తానా, న్యూయార్క్, అమెరికా

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608